నింగి నేలకు దిగింది

రామమోహనరావు ఆ ఇంటి గుమ్మం వరకు వచ్చి రెండు నిముషాలు అచేతనంగా నిలుచుండి పోయాడు.

గణపతిరావు, హెల్తు ఇనస్పెక్టరు అన్న నేమ్ బోర్డు ఉంది.

తలుపు తట్టడమా, మానడమా అని మథన పడ్డాడు. తన రాక వారికి ఆనందాన్ని కలిగిస్తూందా కోపాన్ని తెప్పిస్తుందా అన్న భావన లేదు. తనను అవమానించి గెంటి వేస్తారేమో నన్న సంశయం లేకపోలేదు.

అతనికి ఒక వంక బాధగా వుంది వేరొకవంక కర్తవ్యం గుర్తుకొస్తున్నది.

ఇంత దూరం ఎందుకు వచ్చాడు? కలియకుండానే తిరిగి వెళ్ళిపోవడానికా?

సీత!

తను అగ్నిసాక్షిగా పెళ్ళాడిన అర్ధాంగి. ఆమెను వదిలి వుండలేడనేది అతని బాధకాదు. పాతిక సంవత్సరాలపాటు ఈ జీవితానికి అలవాటుపడ్డాడు. అందులో మార్పు లేకపోతే బ్రతకలేనన్న బాధలేదు. పెళ్ళి మూడు సంవత్సరాల కిందట జరిగినా ఒంటరిగానే వుంటున్నాడు. జీవితంలో వెలితి లేదనికాదు. అయినా ఆ వెలితిని చూసి అతను బాధపడడంలేదు.

సీతను తలదన్నేవాళ్ళు కాకపోయినా ఆమెకు సరితూగ గలిగిన వాళ్ళు అతనికి దొరకరన్న చింతలేదు. అప్పటికే ఆడపిల్లల తండ్రులు ముగ్గురు నలుగురు అతని చుట్టూ అతని తండ్రి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఊ అంటే కన్యాదానం చేయడానికి సిద్ధంగా వున్నారు. అందులో ఒకతను ప్లీడరు గుమస్తా. క్షణంలో విడాకులు ఇప్పించే పూచీ తనదంటూ ముందుకు వచ్చాడు.

కాని రామమోహనరావు దానికి అంగీకరించలేకపోయాడు. న్యాయాన్యాయాల గురించి ఆలోచించాడు.

"న్యాయాన్యాయాల గురించి ఆలోచించవలసింది మనం కాదు. గణపతిరావుకి ఆ జ్ఞానం వుండాలి. ఆడపిల్లవాళ్ళకే అంత మొండిపట్టుదల అయితే మనం కాళ్ళబేరానికి ఎందుకు వెళ్ళాలి? అంతకు మించిన తలవంపు లుంటుందా? ఇంకా నయం మనం కాబట్టి ఇంతకాలం

అగేం. దేనికేనా ఒక హద్దు వుంటుంది. నా మాట విని నీవు వేరే పెళ్ళి చేసుకో. విడాకులు దొరకవన్న భయంలేదు" తండ్రి పదేపదే హితబోధ చేయసాగాడు.

అతనన్న దానిలో తప్పులేదు. అతని ఆరాటం అతనిది.

రామమోహన రావుకి పెళ్ళినాటి సంగతులు గుర్తుకొచ్చాయి. గుర్తుకిరావడమే కాదు, వీడియో చిత్రంలా ఆనాటి సంఘటనలు కళ్ళకు కట్టాయి.

అబ్బా! ఎంత పెడసరం! ఆడపెళ్ళి వారు అన్న భావనేనా లేకుండా స్థానబలం చూసుకొని ఎంత మొండిగా ప్రవర్తించారు?

అసలు తన తల్లిది ఏం తప్పువుందని? తోటలో దిగినప్పుడు చీరా పంచల చాపులూ ఇవ్వడం రివాజుకాదా? కన్యాదానం అప్పుడు వియ్యాల వారికి బట్టలు పెట్టారా? అప్పగింతల్లో పెళ్ళికొడుకు తల్లికీ తండ్రికి చీరా పంచల చాపులు ఇవ్వడం ఆనవాయితీ కాదా? ఆ వేడుకలు తీర్చమంది అమ్మ.

పట్టుబట్ట లిమ్మని పట్టుబట్టలేదే? సాదా బట్టలైనా ఆనవాయితీగా ఇవ్వమంది. అందుకు సీత తండ్రి హంగామా చేయాలా? కట్నకానుకల గురించి మాట్లాడు కున్నప్పుడు వీటి ప్రసక్తిరాలేదు. తాను ఇస్తానని మాట ఇవ్వలేదు కాబట్టి ఇచ్చేదే లేదు అన్నాడు.

'ఈమాత్రం చదువు వెలిగించి చేస్తున్న వుద్యోగానికి నేను కాబట్టి పదివేల కట్నం ఇస్తున్నాను. మరెవరైనా అయిదు వేలు అయినా ఇవ్వరు' అంటూ దెప్పిపొడిచాడు. నలుగురిలో ఎంత తలవంపులు కలిగించాయి. నిజమే, పదివేలు కావాలని తండ్రి అన్నాడు. తన చదువు వుద్యోగం అతనికినచ్చకపోతే ఈ సంబంధానికి ఎందుకు అంగీకరించాలి? అయిష్టమైన సంబంధం ఎందుకు చేసుకోవాలి?

రామమోహనరావుకి చెప్పలేనంత కోపం వచ్చింది. నలుగురిలో అవమానించే అధికారం అతని కెవరిచ్చారు? ఆ పదివేలూ అతని మొహన పారేసి – మరో సంబంధం చేసుకోండి అని చక్కా వెళ్ళిపోవాలనిపించింది. పాలపొంగులాంటి వయసు. వాళ్ళతో మాటలు పడడానికా వచ్చారు తాము?

అలాంటి మొండిమనిషి కూతురే ఈమె. ఆమె మెడలో తాళికట్టి తాను ఆమెను భరించగలడా?

విడిదిలో అడుగుపెట్టిన దగ్గరనుంచి అవమానాలు చేయాలనే వాళ్ళు ప్రయత్నించారు. వాళ్ళపొగరుమోతుతనం క్షణక్షణం బయటపడేది. గదులు వూడిపించినట్లు లేవు పనివాళ్ళను పంపించండి అని కబురుపెడితే చీపురుకట్ట పంపించారు. అపరాహ్ణందాటి రెండుగంటలైనా భోజనాలకు పిలుస్తు రాలేదు. చంటిపిల్లలు శోషవచ్చి పడిపోయారు. కొంచెం పాలూ, మరో

మారు కాఫీలు పంపించండి అని కబురు పెడితే, మీకు ఆరాఆరా పాలూ కాఫీలూ తాగే అలవాటుంటే హోటలు కెళ్ళి రండి అని సలహా ఇచ్చారు. ఈ మర్యాదలకు ఒళ్ళు మండి పెళ్ళీ లేదూ గిళ్ళీలేదు వెనక్కు పోదాం పదండి అన్నారు కొందరు. వాళ్ళ మాట సబబుగా వుందనిపించింది రామమోనరావుకి. కాని అతని తల్లి అంగీకరించలేదు.

"వాళ్ళు నీచంగా ప్రవర్తిస్తున్నారు కదా అని మనంకూడా నీచంగా ప్రవర్తించాలా? అభం శుభం తెలియని ఆ పిల్ల చేసిన తప్పేమిటి? ఇలా పీటలమీద పెళ్ళి ఆగిపోతే ఆమె బ్రతుకు నాశనం అవదా? ఓ నాలుగు గంటలు మనవి కావనుకుంటే సరి. ఆతరువాత ఆ పిల్లను తీసుకొని మనం మన దారిన పోతాం. తగవులకు పట్టింపులకు ఇది సమయం కాదు" అంది.

అమ్మ దొడ్డమనసుకి కొంద రామెను శ్లాఘించారు.

ఆయినా ఆమె ఆశించింది కాలేదు.

గణపతిరావుగారికి మనసు చలించిందో తాగిన మైకమో పిల్లను అత్తవారింటికి పంపడానికి అతను అంగీకరించలేదు.

"అల్లుడి జీతం అతని తిండికే చాలదు. నా కూతురేం సుఖపడుతుంది. వేరింట కాపురం పెడితే పంపిస్తాను. అంతేకాని ఆ ఇంట్లో వంటలక్కగా వెట్టిచాకిరీ చేసే హీనస్థితి నా కూతురికి లేదు" అన్నాడు.

నలుగురూ అతనికి గడ్డి పెట్టారు. అయినా తాపట్టిన కుందేలుకి మూడే కాళ్లు అన్న తన మంకుపట్టు విడువలేదు అతను.

అప్పటినుంచి సీత రాక కోసం నిరీక్షిస్తూ కాలం గడపసాగాడు. మామగారికి పదేపదే ఉత్తరాలు రాసాడు. ప్రయోజనం మాత్రం శూన్యం.

ఈలోగా తల్లి కాలధర్మం చెందింది.

తండ్రి ఓరిమి నశించింది.

"బాబూ! వాళ్ళ పిల్ల సుఖపడడం వాళ్లకే ఇష్టం లేనప్పుడు మనం చేసేది ఏముంది? తన కూతురికి మారుమనువు చేయాలనుకుంటున్నాడు కాబోలు. నువ్వుమాత్రం ఎంత కాలం ఒంటరిగా వుంటావు? నా మాట విని విడాకులు తీసుకొని మళ్ళీ పెళ్ళి చేసుకో"

నిజమే! తండ్రి బాధను అర్థం చేసుకోగలడు. సీత వస్తుందన్న ఆశ సన్నగిల్లింది. తండ్రి మొండివాడైనంత మాత్రాన సీతకు పరిస్థితులు తెలియవా? పోనీ ఆమె తల్లి తనకేం పట్టనట్లుంటున్నదేం?

రామమోహనరావుకు ఏమీ పాలుపోలేదు.

"నాన్నా! మీరు అన్నది సందర్భంగానే వుంది. అయితే సీత జీవితాన్ని నాశనం చేయలేను. పెళ్ళిఅయి మొగుడిచేత పరిత్యజించబడిన స్త్రీని లోకం ఎంతోహీనంగా చూస్తుంది! ఆ తండ్రి తప్పులకు సీతకా శిక్షా? అమ్మ మనసుకు శాంతి వుండదు. చివరగా మరొకసారి ప్రయత్నిస్తాను. ఈ పర్యాయం నేనే స్వయంగా వెళ్తాను. సీతను నాతో పంపిస్తే సరేసరి. లేదా అప్పుడే వాళ్ళతో తెగతెంపులు చేసుకుందాం."

రామమోహనరావు ఆరోజే సీత తండ్రి గణపతిరావుగారికి ఉత్తరం రాసాడు.

"నేను సోమవారం వస్తున్నాను. మంగళవారంనాడు సీతను తీసుకువెళ్తాను. మీ ఏర్పాట్లు మీరు చేసుకుందికిగాను ముందుగా తెలియజేస్తున్నాను."

ఉత్తరం పోస్టు చేసాడు కాని అతనికి అనుమానంగానే ఉంది. సీతను పంపిస్తారా? ఇంకా దుర్భాషలాడుతారా? తన ఉద్యోగంలో మార్పులేదు. వేరింటికాపురం పెట్టబోవడం లేదు.

రామమోహనరావు ఒక నిశ్చయానికి వచ్చాడు. ఇంతదూరం వచ్చి తిరిగి వెళ్ళి పోవడం భావ్యంకాదు. తన ఆలోచన సవ్యంగా లేదేమో? వస్తున్నానని రాసి వెళ్ళక పోవడం పెద్దమనిషి తరహాకాదు. ఇక అవమానిస్తారన్న భయమా? దూషణ భూషణలు శరీరానికే కాని ఆత్మకు కావు.

తలుపు తట్టాడు.

"ఎవరు?" లోపలినుంచి ప్రశ్నించింది ఒక తీయని కంఠం.

'నేను'.

తలుపులు తెరుచుకున్నాయి.

తన ఎదురుగా నిలుచున్నది తాను తాళికట్టిన భార్య తన సీతేనని అతను గుర్తించలేకపోయాడు. సీత కూడా రామమోహనరావుని గుర్తించలేదు. అది విడ్డూరంకాదు. పరిస్థితుల ప్రభావం.

"గణపతిరావు గారున్నారా? నేను రామమోహనరావుని. భిలాయ్ నుంచి వచ్చాను" అన్నాడు నేలవంక చూస్తూ.

బెదిరిన లేడిలా లోనికి పరుగుతీసింది ఆమె.

రామమోహనరావుకి అర్థం కాలేదు. ఉన్నారని కాని లేరని కాని చెప్పలేదు. లోనికి రమ్మన లేదు. అయితే వాళ్ళకు ఇంకా తనను అవమానించాలనే వుంది కాబోలు అనుకున్నాడు.

"అమ్మా! అతనొచ్చారే!"

"ఎవరే?"

"అతనేనే!"

"అతనే అంటే ఎలా అర్థమౌతుందే? పేరూ వూరూ లేదా?"

రామమోహనరావుకి వారి మాటలు వినిపిస్తున్నాయి.

"మీ అల్లుడుగారు" అంది.

ఏమిటీ తలుపు తీసింది తన భార్యేనా! తను గుర్తుపట్టలేక పోయాడు. సీత తన ముందుకు వస్తుందని వూహించలేదు. పాపం సిగ్గుతో జవాబు చెప్పకుండా వెళ్ళిపోయింది.

"ఏమిటి ఈ వేళప్పుడొచ్చాడా! రైలు ఆరుగంటలకైతే అపరాత్రికా రాక?" అంటూ ఆమె బయటకొచ్చింది.

రామమోహనరావు హృదయం బాధగా మూలిగింది. తన తప్పేంవుంది. రైళ్లు సమయానికి రావడం విచిత్రం కాని లేటు అయితే అందులో ఆశ్చర్యపడవలసింది ఏముంది? నిండా పది గంటలు కానిదే ఆమెకు అపరాత్రి అయిందా? నేరక వచ్చాడు తను.

"రా బాబు రా! బయటే నిల్చుండి పోవాలా?"

రామమోహనరావు వచ్చి వసారాలో కుర్చీలో కూర్చున్నాడు.

"అంతా బాగున్నారా? మీ అమ్మగారు పోయారని విన్నాము".

రామమోహనరావు జవాబిచ్చి "అత్తయ్యగారూ! రేపు పది గంటల బండికే మా ప్రయాణం. మీకు నా ఉత్తరం అందే ఉంటుంది. నేను సీతను తీసుకు వెళ్లడానికి వచ్చాను".

"ఉత్తరానికేం అందింది. అయినా ఇంత తొందరగా పంపడం ఎలా వీలవుతుంది?"

"తొందరా? మూడు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాను. చివరకు వారం రోజుల ముందు వుత్తరంరాశాను."

"రాశావు. కాదనలేదు. ఆడపిల్లను అత్తవారింటికి ఒట్టి చేతులతో ఎలా పంపుతాం? దానికి వ్యవధి కావాలిగా?"

"అత్తయ్యగారు! నేనేం పెట్టుపోతలు ఆశించి రాలేదు. మీకు అమ్మాయిని పంపించడం సమ్మతమో కాదో చెప్పండి."

"పిల్ల నిచ్చుకున్న తరువాత తప్పుతుందా బాబూ! రేపా విషయాలు ఆలోచించుకోవచ్చు. నువ్వు కాస్తా విశ్రాంతి తీసుకో. నీ భోజనం సంగతి చూడాలిగా."

"అబ్బే ఆ శ్రమ అనవసరం."

"ఏం బాబూ! అత్తవారింట్లో అన్నం మెతుకులకు కూడా దొరకలేదని మామీద

అభాండాలు వేయడానికా? ఇప్పుడు పంచభక్ష్య పరమాన్నాలు వండిపెట్టలేను కాని ఏదో ఇంత వుడికిస్తాను. తిని నిద్రపో".

"అదేంకాదు. నేను హోటల్లో భోజనం చేసి వస్తున్నాను. ఇంత రాత్రి మిమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెట్టడం అని" అన్నాడు రామమోహనరావు.

ఆమె అక్కడే పక్కవేసింది.

"నా ప్రశ్నకు జవాబు చెప్పలేదు."

"జవాబు చెప్పడానికేం వుంది. తెల్లవారన తరువాత మీ మామయ్యనే అడుగు. ఆడవాళ్లం మా మాటకు విలువెక్కడ?" అంది.

మర్నాడు వుదయం కాఫీ తాగుతూ తిరిగి భార్యను పంపించే విషయం అత్తగారితో ప్రస్తావించాడు రామమోహనరావు. అప్పుడు ఎనిమిది గంటలవవస్తున్నది.

"బాగుంది బాబూ నీ వ్యవహారం. పీకలమీద కూర్చుని తేల్చిచెప్పమంటే ఎలా? అమ్మాయికి పెళ్లి చేసింది మా ఇంట్లో వుంచుకోడానికా? మీ మామయ్యగారు అర్జంటు పనిమీద ఊరు వెళ్లారు. నీతో మాట్లాడాలని అనుకున్నారు కాని నువ్వు అప్పుడు గాఢనిద్రలో వున్నావు. సాయంత్రం వరకు ఆగు బాబు. వారు రాగానే మీ ప్రయాణానికి ఏర్పాటు చేస్తారు."

"అత్తయ్యగారు! అది వీలయ్యేది కాదు. అందుకే ముందుగా ఉత్తరంరాసాను."

"ఒప్పుకుంటున్నాను. ఏ నిర్ణయమైనా తీసుకొనే అధికారం మా ఆడవాళ్ల కెక్కడ ఏడ్చింది! మీ మామగారు లేరు. ఒక్క రోజు వుంటే ఆకాశం విరిగిపడుతుందా? మీ అత్తగారి యింటిలో భోజనం చేయకూడదని ఒట్టు వేసుకున్నావా? అత్తగారి యింటిలో అల్లుడికి భోజనమైనా పెట్టలేదు అన్న చెడ్డపేరు మాకు తేవాలనుకుంటున్నావా? రాత్రి భోజనమయినా చేయకుండా పడుకున్నావు. ఇప్పుడు వెళ్లిపోవాలంటూ పీకలమీద కూర్చున్నావు."

"అత్తయ్యగారు! మీరు పొరబాటుగా అర్థంచేసుకొంటున్నారు. నేను చేస్తున్నది చిన్న ఉద్యోగం. మామయ్యగారిలా ప్రతిష్ఠ కలదిగాదు. శెలవు పొడిగించుతే ఆ వుద్యోగానికి ముప్పు వస్తుంది. నాకు మీరే సత్కారాలూ చేయనవసరం లేదు. పెట్టుపోతలూ అక్కరలేదు. నా కర్తవ్యం నన్నిక్కడకు రప్పించింది. చెప్పండి సీతను నాతో పంపించడం ఇష్టంలేదా? లేదా సీతకే నాతో రావడం ఇష్టంలేదా?"

ఆమె ఎటూ చెప్పలేకపోయింది. ఆమె అడకత్తెరలో పోకచెక్కలాగయింది. అటు భర్త ఆంక్షలు ఇటు అల్లుడి భల్లూకంపట్టు.

"రైలుకి వేళ అవుతున్నది నేను వస్తాను" రామమోహనరావు కుర్చీలోంచి లేచాడు.

"ఆగండి, నేను వస్తున్నాను" అంది సీత.

ఆమె అశ్చర్యపోయింది. "సీతా! నాన్నగారు..."

"అమ్మా! నేనేమీ అర్థం చేసుకోలేని చిన్నపిల్లను కాను. పంతాలకు పోయి నా పచ్చని సంసారంలో చిచ్చుపెట్టుకోలేను"

"అమ్మా! నిన్నిలా కట్టుబట్టలతో పంపించేయడం మాకు తలవంపులు కాదూ! మీ నాన్నగారికి నేనేం జవాబు చెప్పను?"

"అమ్మా! అతను ఏమీ ఆశించడంలేదే! మధ్యనున్న నీకెందుకు వ్యథ? నాన్నగారికి నిజంగానే అర్జంటు పని వుందనే వెళ్ళిపోయారా? అల్లుడి మీద నిరసన కాదూ? ఇప్పుడు చెప్పు నాన్నగారు ఆ టూరుమీద వెళ్లకపోతే ఆకాశం విరిగిపడుతుందా? నేను వినలేదనుకోకు. అల్లుడికి ఎలాంటి అతిథ్యాలూ చెయ్యాల్సిన అవసరం లేదంటూ ఆర్డరు వేసారే! సారె సామానులు కావాలంటాడో తిరుగు రైలు ఛార్జీలు కావాలంటాడో? మనం అనుకున్నవి పెళ్ళిలోనే ఇచ్చాం. ఇంక వేరే ఇచ్చేది లేదు" అన్నారు. నాన్నగారు మొండి పట్టుదల ప్రదర్శించుతున్నారు. అతని స్వభావం నాకు తెలుసు. అయినా కన్నతల్లివి. నీకూ నా మీద అభిమానం లేదా? పెళ్ళిలోనైనా వాళ్లు ఏం అడగరానివి అడిగారని, మీరు నా జీవితాన్ని నాశనం చేయాలనుకుంటున్నారు? నిజమే ఆయనకంటే నేను ఎక్కువ చదువుకున్నాను. నా కాళ్ల మీద నేను నిలబడగలను. అయితే అది జీవితానికి నిండుతనాన్ని ఇస్తుందా? వివాహమైనా ఇలా కన్యగానే జీవితాంతం వుండిపోమంటావా? ఆకాశానికి ఎగిరే అవకాశం మనకు లేదు. నింగే నేలకు దిగివచ్చినా అందుకోవకపోవటం, చేరుకోకపోవటం మూర్ఖత్వం కాదా? మీరింతగా వారిని అవమానించినా నిండు మనసుతో నన్ను పిలుచుకుపోవడానికి వచ్చిన ఆయన ఔన్నత్యాన్ని ఇప్పటికైనా మీరు అర్థం చేసుకోలేకపోయినా నేను అర్థంచేసుకోగలను. మనం అతనిస్థాయికి ఎదగలేకపోయాం. అతనే దిగివచ్చారు. అలాంటి భర్తను నేను ఎలా వదులుకోగలను? నాన్నవస్తే చెప్పు. మీ కూతురు కట్టుబట్టలతో వెళ్ళిపోయిందని" అంటూ సీత భర్త చేయి అందుకుని బయటకొచ్చి రిక్షాపిలిచింది.

కట్టుబట్టలతో వెళ్లిపోతున్న కూతుర్ని చూసి ఆమె కళ్లలో నీళ్ళు నిండుకున్నాయి.

– ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 17 జులై 1987